బాధ్యతతో పనిచేయాలి

పుష్పగుచ్ఛాన్ని స్వీకరిస్తున్న ఎస్‌పి రాధిక

శ్రీకాకుళం: మరింత బాధ్యతతో పనిచేయాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన సిఐలు, ఆమదాలవలస నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సిఐలకు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉద్యోగోన్నతులు పొందిన సిఐలు ఎల్.రామకృష్ణ, ఎ.లక్ష్మణరావు, ఆమదాలవలస సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జి.వాయనందన్ యాదవ్‌లు ఎస్‌పిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఉద్యోగోన్నతులు పొందినప్పటికీ ఎక్కడ పనిచేసినా ప్రజలకు పారదర్శకమైన పోలీస్ సేవలు అందించాలని, అదేవిధంగా రానున్న ఎన్నికల నేపథ్యంలో బాధ్యతగా పనిచేసి మనలను పొందాలని ఎస్‌పి సూచించారు.

డిఎస్‌సి ఊరింపేనా?

- ఇదిగో అదిగో నోటిఫికేషన్ అంటూ ప్రకటనలు
- జిల్లా నుంచి ప్రతిపాదనలే పంపని వైనం

డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు (ఫైల్)

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డిఎస్‌సి నోటిఫికేషన్‌పై ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైంది. ఇదిగో అదిగో అంటూ గత కొద్దినెలలుగా ప్రభుత్వం నిరుద్యోగ ఉపాధ్యాయులను ఊరిస్తోంది. తాము అధికారంలోకి వస్తే ఏటా డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తామంటూ ఇచ్చిన మాటనూ ప్రభుత్వం తప్పింది. ఎన్నికల నేపథ్యంలో చివరి సంవత్సరంలోనైనా నోటిఫికేషన్ వస్తుందని అంతా భావించారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సైతం నోటిఫికేషన్ ఇస్తున్నామంటూ ప్రకటించడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. ప్రభుత్వం వైపు నుంచి మాత్రం ఎటువంటి ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో నోటిఫికేషన్ వస్తుందా? లేదా? అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 14 బిఇడి కళాశాలలు ఉన్నాయి. కోర్సు రెండేళ్ల కాలపరిమితి కావడంతో ప్రతి రెండేళ్లకు సుమారు 700 నుంచి 800 మంది రిలీవ్ అవుతున్నారు. వీటితో పాటు 16 డిఇడి కళాశాలు ఉన్నాయి. ఒక్కో కళాశాల నుంచి 50 మంది చొప్పున ప్రతి రెండేళ్లకు 800 మంది రిలీవ్ అవుతున్నారు. వీరు కాకుండా ఇప్పటికే బిఇడి, డిఇడి కోర్సులు పూర్తి చేసి ఉద్యోగాలు రానివారు వేలాది మంది ఉన్నారు. టిడిపి హయాంలో అక్టోబరు 25, 2018న చివరి సారిగా నోటిఫికేషన్ వెలువడింది. ఆ తర్వాత ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాలు జరగలేదు. దీంతో వేలాది మంది నోటిఫికేషన్ కోసం ఆత్రంగా చూస్తున్నారు. డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తామని ప్రభుత్వం చెప్తున్నా ఆ వైపుగా అడుగులు మాత్రం పడటం లేదు. నోటిఫికేషన్ కోసం జిల్లాల నుంచి వివరాలు సైతం తీసుకోలేదని తెలిసింది. ఏడాదిన్నర కిందట అధికారులు పంపిన వివరాలు మినహా కొత్తగా ఏమీ పంపలేదని తెలుస్తోంది. దీంతో డిఎస్‌సి నోటిఫికేషన్ మాట ఉత్తదే అనే చర్చ జరుగుతోంది.

కొత్త ఉద్యోగాల భర్తీ వద్దంటూ ప్రత్యేక ఆదేశాలు

ఉద్యోగాల భర్తీపై ఆర్థికశాఖ ఇటీవల జారీ చేసిన ఆదేశాలు నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేశాయి. ఏ ప్రభుత్వ శాఖలోనూ ప్రస్తుతం కొత్తగా ఉద్యోగాల భర్తీకి ప్రతిపాదనలు పంపొద్దని సూచించినట్లు తెలిసింది. పోస్టుల అప్‌గ్రేడేషన్, కొత్త పోస్టుల ఏర్పాటుకు సన్నాహాలు చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వం సూచించినట్లు వార్తలు వస్తున్నాయి. చివరకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను సైతం నియమించొద్దంటూ ఉత్తర్వులు వెలువరించింది. ఈ నేపథ్యంలో డిఎస్‌సి నోటిఫికేషన్ వచ్చే అవకాశం లేదని విద్యాశాఖకు చెందిన ఒకరిద్దరు అధికారులు అభిప్రాయపడ్డారు. నోటిఫికేషన్ ఇస్తామని ఊరించి ప్రభుత్వం తమను మోసం చేసిందంటూ పలువురు నిరుద్యోగ అభ్యర్థులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికలు వస్తుండటంతో నిరుద్యోగుల ఆగ్రహాన్ని చల్లార్చడానికే విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారయణ నోటిఫికేషన్ ప్రకటనలు చేస్తున్నారంటూ మండిపడుతున్నారు.

నిరుద్యోగుల్లో తీవ్ర నిరాశ నిస్పృహలు

డిఎస్‌సి నోటిఫికేషన్ ఇక వచ్చే అవకాశం లేకపోవడంతో నిరుద్యోగుల్లో తీవ్ర నిరాశ, నిస్పృహలు నెలకొన్నాయి. సుమారు ఆరేళ్లుగా డిఎస్‌సి నోటిఫికేషన్ లేకపోవడంతో బిఇడి, డిఇడి కోర్సులు చేసిన వారు ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా చేరిపోయారు. కొంతమంది ప్రయివేట్ ఉద్యోగాల్లో కుదురుకున్నారు. మరికొంత మంది వాలంటీర్లుగా సేవలు అందిస్తున్నారు. విద్యాశాఖ మంత్రి గత కొద్ది నెలలుగా డిఎస్‌సికి సంబంధించి ప్రకటనలు చేయడంతో నిరుద్యోగ ఉపాధ్యాయుల అంతా ప్రిపరేషన్ మొదలు పెట్టేశారు. మరికొంత మంది కృష్ణ జిల్లా అవనిగడ్డలోని డిఎస్‌సి శిక్షణ కేంద్రానికి సైతం పయనమయ్యేందుకు సిద్ధమవుతున్నారు. కొత్త ఉద్యోగాల భర్తీ వద్దంటూ ఆర్థికశాఖ జారీ చేసిన ఆదేశాలతో వారు నిరాశ నిస్పృహల్లో కూరుకుపోయారు.

కేన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జెసి నవీన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో కేన్సర్ రోగులకు వైద్యం అందించాన్న సంకల్పంతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన అత్యున్నత ప్రమాణాలతో, అత్యాధునిక సౌకర్యాలతో కేన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. మగటపల్లి రమణమూర్తి ఛారిటబుల్ ట్రస్టు ఆర్థిక సాయంతో రూ.25 లక్షలతో నిర్మించిన శాంతా కళ్యాణ్ అనురాగ నిలయం రక్షిత గృహం (బాలురు), సి.వి.నాగజ్యోతి ఆనంద నిలయం (పురుషుల వృద్ధాశ్రమం) భవనాలను శనివారం జెసి ఎం.నవీన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్ ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే జిల్లా వాసులతో పాటు పొరుగునే ఉన్న ఒడిశా వాసులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఇందుకోసం ఇప్పటికే ఏడెకరాల స్థలం కేటాయించామని, త్వరలోనే అన్ని అనుమతులు వస్తాయని ఆశిస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్, వెల్లూరు వంటి దూరాలకు వెళ్లి కేన్సర్ రోగులు జిల్లా నుంచి ఎంతో ప్రయ, ప్రయాసలకు లోనవుతున్నారని అన్నారు. కేన్సర్ ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే ఇకపై ఆ కష్టం తప్పుతుందన్నారు. ఆలాగే ఆటిజం కోసం ప్రత్యేక చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. రెడ్‌క్రాస్ కోసం చేసిన ప్రతి పనీ తన మనసుకు ఎంతో సంతృప్తి నిచ్చిందని పేర్కొన్నారు.

జెసి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సేవా దృక్పథంతో అందరూ బాగుండాలని, ఎదుటి వారి కోసం తమ సమయాన్ని, డబ్బు, శ్రమ కేటాయించడం హర్షణీయమని అన్నారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర వైస్‌చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ కలెక్టరేట్ దగ్గరలో 32 సెంట్ల స్థలంలో వృద్ధాశ్రమం, ఇప్పుడు రక్షిత గృహం రెండు భవనాలు కలెక్టర్‌తో ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సి.వి.ఎన్.మూర్తి, కంటి వైద్యులు పి.ఎల్.ఎన్.రాజు, ఎన్‌ఎసిఎల్ వైస్ ప్రెసిడెంట్ వరదరాజులు, కనుగుల దుర్గాశ్రీనివాస్, బెజ్జిపురం యూత్ క్లబ్ ప్రసాదరావు, పి.వైకుంఠరావు, డాక్టర్ కృష్ణంరాజు, సత్యనారాయణ, పెంకి చైతన్యకుమార్, డాక్టర్ సోమేశ్వరరావు, నిక్కు అప్పన్న పాల్గొన్నారు.

6 నుంచి ఎస్‌ఎఫ్‌ఐ ప్రజ్ఞా వికాస పరీక్ష

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఈ ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ముందస్తు ప్రణాళికల్లో భాగంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ఫిబ్రవరి 6 నుంచి 8 వరకు ప్రజ్ఞ వికాస పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ తెలిపారు. జిల్లా కార్యాలయంలో ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఈ పరీక్ష ఒక మైలురాయిగా చేసుకుని ఇందులో వారి ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడుతుందన్నారు. ఈ ఏడాది ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గతేడాది కంటే నెల రోజులు ముందు పరీక్షలు జరగనున్నాయని అన్నారు. అందువల్ల వార్షిక పరీక్షలకు ముందుగా ఈ పరీక్ష విద్యార్థులకు ఎంతో ఉపయోగ కరమని అభిప్రాయపడ్డారు. ఈ ప్రజ్ఞ వికాస పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ రూపంలో 100 మార్కులకు ఉంటుందని తెలిపారు. పరీక్షలో వారు చదువుకునే అన్ని సబ్జెక్టుల పాఠ్యాంశాల నుంచి ప్రశ్నపత్రాలను రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పది విద్యార్థులు సద్వినియోగపరచుకుని రానున్న వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్, ఉపాధ్యక్షులు టి.తిరుపతిరావు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర సేవలు

శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జ్ఞానసువర్ణరాజు

జ్ఞానసువర్ణరాజు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సేవా రంగాల్లో లోపాలకు సత్వర న్యాయం లోక్ అదాలత్ ద్వారా పొందవచ్చని జిల్లా శాశ్వత లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ చైర్మన్ జ్ఞాన సువర్ణ రాజు అన్నారు. తన కార్యాలయంలో శనివారం ఉదయం ఆయన జిల్లాలోని పలు శాఖల ఉన్నతాధికారులతో ప్రజాప్రయోజన సేవలపై, ఆయా శాఖలు చేపట్టాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆర్టికల్ 21 ద్వారా ప్రతి పౌరుడూ న్యాయం పొందే హక్కు కల్పించిందన్నారు. అందులో భాగంగా అవసరమైన ప్రజలకు సత్వర న్యాయాన్ని అందించేందుకు శాశ్వత లోక్ అదాలత్ పనిచేస్తుందని, ఇక్కడ లభించే తీర్పు సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో సమానమని, తీర్పు వెలువడ్డాక పైకోర్టుకు అప్పీల్ అనేది ఉండవని స్పష్టం చేశారు. రూ.కోటి విలువ గల వివాదాలు ఇక్కడ ప్రజాప్రయోజిత సేవ రంగాలకు సంబంధించి రవాణా, సమాచార, విద్యుత్, నీటి సరఫరా, గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ ప్రజా సేవలు, ప్రజారోగ్యం, బీమా సౌకర్యాలు, విద్యాసంస్థలు, స్థిరాస్తి వ్యాపారం, ఉపాధి హామీ, బ్యాంకుల సేవా లోపాలు ఎదురైనప్పుడు పర్మనెంట్ లోక్ అదాలత్ సత్వర సేవలు పొందవచ్చునని పేర్కొన్నారు. 90 రోజుల్లో పై వెలువడి బాధితులకు స్వాంతన కలిగిస్తామని గతంలో వెలువడిన తీర్పులను ఉదహరిస్తూ అవగాహన కల్పించారు. ఆయా సేవలపై ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆయా శాఖలకు ఉందన్నారు. సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ గణపతిరావు, ఎపిఎస్ ఆర్‌టిసి నుంచి దక్షిణామూర్తి, ఉపాధి హామీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ నాయకులకు నోటీసులు

నారాయణరావు, ఓంకార్‌లకు నోటీసులకు అందజేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి, పలాస

ఈనెల 28న రాజమండ్రిలో జరిగబోయే పాత పెన్షన్ సాధన సభకు వెళ్లొద్దంటూ పోలీసులు ఉపాధ్యాయ సంఘ నాయకులకు పాఠశాలలకు వెళ్లి శనివారం నోటీసులు జారీ చేశారు. అందులో భాగంగా మండలం దంత ప్రభుత్వ పాఠశాలకు పోలీసులు వెళ్లి యుటిఎఫ్ జిల్లా నాయకుడు గొండు నారాయణరావుకు నోటీసులు అందజేశారు. పాత పెన్షన్ సాధన సభకు వెళ్లనియకుండా పోలీసులు ముందస్తు నోటీసులు జారీ చేయడం సరికాదని నాయకులు నారాయణరావు, వై.వాసుదేవరావు అన్నారు. అప్పటి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన పెన్షన్ విధానానికి అనుగుణంగా రాష్ట్రంలో ఉద్యోగులకు ఉపాధ్యాయులకు సెప్టెంబరు 2004 నుంచి కంటిబ్యూటరీ పెన్షనను విధానం అమలు అయిందని అన్నారు. ఈ విధానంలో పాత పిపెన్షన్ విధానం కంటే ఎక్కువ ప్రయోజనాలు లభిస్తాయని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రచారం ఒట్టి భూటకమేనని వారు అన్నారు.

పలాస మండలం పద్మనాభపురం కాలనీ పాఠశాలలో యుటిఎఫ్ జిల్లా నాయకులు బి.ఓంకార్‌కు కాశీబుగ్గ పోలీసులు నోటీసు అందజేశారు.

పోక్సో చట్టంతో అత్యాచారాలకు అడ్డుకట్ట

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి-శ్రీ కాకుళం అర్బన్

మహిళలపై జరుగుతున్న హింస, అత్యాచారాలను అరికట్టేదుకు కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పోక్సో చట్టాన్ని తీసుకొచ్చారని, ఈ చట్టం అమలుతో అత్యాచారాలకు అడ్డుకట్ట వేసేందుకు దోహదపడుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అభిప్రాయపడ్డారు. జిల్లా న్యాయస్థానం సమావేశ మందిరంలో లీగల్ సెల్ విభాగం ఆధ్వర్యాన ఫోక్సో చట్టం శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టం అమలు తరువాత మహిళలపై అఘాయిత్యాలు, హింస కొంతమేరకు తగ్గుముఖం పట్టాయన్నారు. అన్నివర్గాల మహిళలు ఈ చట్టంపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో జరిగే నేరాల్లో మహిళలపై వేధింపులు, ఇతర వివక్ష కేసులు తగ్గాయన్నారు. ఈ చట్టం మరింత పటిష్టవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సులో జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, అదనపు డిజిలు కె.శ్రీదేవి, పి.ప్రభాకరరావు, ఎస్.ఎం.ఫణికుమార్, ఎం.అనురాధ, న్యాయవాది బి.జ్యోతి, సిఎజ దిశైఎమెల్లా పాల్గొన్నారు.

అత్యవసర రోగులకు పారిశుధ్య సిబ్బందే దిక్కు

క్షతగాత్రుడుకు వైద్య సేవలు అందిస్తున్న పారిశుధ్య కార్మికులు

పలాస : పలాస సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిలో అత్యవసర రోగులకు పారిశుధ్య సిబ్బంది అందించే వైద్యమే గతవుతుందనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా శనివారం సాయంత్రం ఆర్‌టిసి కాంప్లెక్స్ రోడ్డులో రెండు బైకులు ఢీకొని ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరికి అంబులెన్స్ వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఆ సమయానికి వైద్యాధికారులు ఎవరూ లేకపోవడంతో అక్కడున్న పారిశుధ్య సిబ్బందే క్షతగాత్రులకు సపర్యలు చేసారు. తీరిగ్గా వైద్యాధికారులు వచ్చి రోగులకు వైద్యం అందించినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. పేరుకు సామాజిక ఆస్పత్రైనా రోగులకు వైద్యాధికారులు అందుబాటులో ఉండరనే విమర్శలు ఉన్నాయి. గతంలో ప్రసూతి కోసం వచ్చిన ఓ గిరిజన మహిళకు చివరి నిమిషంలో వైద్యం నిరాకరించడంతో ఆమె 108 వాహనంలోనే ప్రసవించిన విషయం పాఠకులకు విధితమే. దీనిపై సాక్ష్యాత్తు రాష్ట్రమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినా వారిలో కనీసం చలనం లేకపోయింది. జిల్లా వైద్యాధికారులు వచ్చి విచారణ జరిపి మరోమారు ఇటువంటి సంఘటనలు జరిగితే ఉపేక్షించమని హెచ్చరించినా వారిలో మార్పులేకపోవడం తాజా సంఘటన రుజువుచేస్తుంది.

మాట్లాడుతున్న సిఎం జగన్, పాల్గొన్న జనవాహిని

వైసిపి ఎన్నికల సమరోత్సాహం

కేడర్‌ను ఉత్తేజపరిచిన సిఎం జగన్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'75 ఏళ్ల వయసు మళ్లిన చంద్రబాబు మాదిరిగా నేను పొత్తుల కోసం దత్తపుత్రుడు, ఇతరుల వెంట వెంపర్లాడను. ప్రజలే నా ధైర్యం.. సంక్షేమం, అభివృద్ధి పథకాలే నా విధానం' – అని వైసిపి అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. రానున్న ఎన్నికలకు సన్నద్ధంగా విశాఖ జిల్లా భీమిలిలోని సంగివలస వద్ద శనివారం సాయంత్రం వైసిపి ఉత్తరాంధ్ర క్యాడర్‌తో భారీ సభ నిర్వహించారు. దీనికి సిద్ధం సభగా ట్యాగ్‌లైన్ జతచేశారు. ఉత్తరాంధ్ర నలువైపుల నుంచీ తరలివచ్చిన కార్యకర్తలను ఉద్దేశించి జగన్ మాట్లాడారు. ఎన్నికల శంఖారావం పూరించారు. క్యాడర్‌కు 2024 ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తూ విపక్షాలపై పెద్ద ఎత్తున విరుచుకుపడ్డారు. పార్టీ క్యాడర్‌లో ఎన్నికల సమరోత్సాహాన్ని నింపారు. సభకు వేల సంఖ్యలో పార్టీ క్యాడర్ తరలిరావడంతో భీమిలిలో ఇవాళ తనకు అటు సముద్రం, ఇటు జనసముద్రం కనిపిస్తుందని జగన్ వ్యాఖ్యానించారు. సభకు వచ్చిన ప్రతి ఒక్కరిలోనూ ఒక్కో సేనాధిపతి కనిపిస్తున్నారని అన్నారు. ఇటు పక్క పాండవ సైన్యం ఉంటే, అటుపక్క కౌరవ సైన్యం ఉందని అన్నారు. ఈ యుద్ధంలో చంద్రబాబు సహా ప్రతి ఒక్కరూ ఓడిపోక తప్పదంటూ సమరోత్సాహాన్ని ప్రదర్శించారు. పద్మవ్యూహంలో చిక్కుకోవడానికి తాను అభిమన్యుడిని కాదని అర్జునుడినని చెప్పారు. ఈ అర్జునుడికి శ్రీకృష్ణుడిలాగ ప్రజలు తోడున్నారన్నారు. 2024 ఎన్నికల్లో వైసిపికి 175కి 175 రావడం ఖాయమన్నారు. చంద్రబాబుకు ఒంటరిగా పోటీచేసే ధైర్యం లేదన్నారు. 2019 ఎన్నికల్లో వచ్చిన 23 సీట్లు కూడా ఈసారి వారికి రావన్నారు. చంద్రబాబు చెప్పుకోవడానికి ఏమీలేదని అన్నారు కరోనా కష్టకాలంలోనూ ఆర్థిక లాభనష్టాల లెక్కను చూడకుండా తాము సంక్షేమం ఇచ్చామన్నారు. అప్పట్లో చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 650 హామీల్లో 10 శాతం కూడా అమలుచేయకుండా అన్నింటినీ అటకెక్కించేశాడని విమర్శించారు. హామీలు అటకెక్కించిన బాబు ఇంకా బతికే ఉన్నాడని ప్రజలకు వివరించాల్సిందిగా క్యాడర్‌కు జగన్ దిశానిర్దేశం చేశారు. వాలంటీర్లు మనలోంచి వచ్చిన మనవాళ్లేనని, బయటవారు కాదని క్యాడర్‌కు తెలిపారు. 2019 నుంచి 99 శాతం హామీలను అమలు చేశామన్నారు. ఎస్‌టి, బిసిలకు తగిన ప్రాధాన్యత ఇచ్చామని జగన్ అన్నప్పుడు సభలో హర్షధ్వానాలు వినబడ్డాయి. 'మీ పిల్లల తలరాత మారాలన్నా.. పేదల భవిష్యత్తు మారాలన్నా ఎన్నికల్లో జగనే రావాలి' అనడంతో వేదిక ముందు ఉన్న వారు వారి చేతుల్లో ఉన్న 'సిద్ధం' ప్లకార్డులను చూపారు. సమావేశంలో స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, విడదల రజిని, స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పలువురు శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి స్వాగతం పలికారు.

కాంగ్రెస్‌లో జోష్

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

రాష్ట్ర విభజనతో కకావికలమైన కాంగ్రెస్ పార్టీకి పిసిసి అధ్యక్షులు షర్మిల ఇచ్ఛాపురం పర్యటన జిల్లా కాంగ్రెస్‌కు కొంత ఊరటనిచ్చింది. కనుచూపుమేరలో కోలుకోలేదని అంతా భావించినా పార్టీ పగ్గాలను వైఎస్‌ఆర్ తనయ స్వీకరించడం, ఇచ్ఛాపురం వేదికగా రాష్ట్ర పర్యటనకు స్వీకారం చుట్టడం ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఇచ్ఛాపురంలో కార్యకర్తల సమావేశానికి బయలుదేరిన ఆమెకు నరసన్నపేట, టెక్కలి, పలాస జాతీయ రహదారి వద్ద పార్టీ శ్రేణులు, అభిమానులు రోడ్డు పక్కన నిల్చొని ఘన స్వాగతం పలకడంతో నాయకులు ఆనందపరవశలయ్యారు. ఇచ్ఛాపురం పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీ అధిష్టానం, జిల్లా పార్టీ అన్ని రకాల అవకాశాలను వినియోగించుకున్నారు. బ్రదర్ అనీల్‌కుమార్ సూచనలతో క్రైస్తవ మత పెద్దలు, ఇతరులు తమ వంతు సహకారం అందించారు. మరోవైపు జిల్లా పార్టీ నాయకత్వమూ అంతే స్థాయిలో దృష్టిపెట్టి నాయకులు, కార్యకర్తల తరలింపులో తన వంతు పాత్ర పోషించింది. దీంతో ఇచ్ఛాపురం పర్యటన విజయవంతమైంది. పార్టీకి సంతోషాన్ని మిగిల్చింది. కంచిలి నుంచి ఇచ్ఛాపురం వరకు బస్సులో ప్రయాణించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడం ద్వారా పర్యటనకు అదనపు మైలేజ్ వచ్చినట్లయింది.

కాంగ్రెస్ ఓటు బ్యాంకుపై ఇటీవల ఆ పార్టీ సర్వే చేసినట్లు సమాచారం. జిల్లాలో కాంగ్రెస్‌కు 8 శాతం వరకు ఓటు బ్యాంకు ఉందని సర్వేలో తేలింది. టెక్కలి నియోజకవర్గంలో అత్యధికంగా 12 శాతం, పలాసలో 11 శాతం, ఇచ్ఛాపురంలో 9 శాతం ఉన్నట్లు తెలిసింది. రాబోవు రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు మరింత పెరగనుందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికిప్పుడు గెలిచే పరిస్థితి లేకున్నా మెరుగైన ఓటింగ్ శాతం సాధిస్తామని జిల్లా పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ సాధించే ఓట్లపైనే ప్రధాన రాజకీయ పార్టీల్లో కొంత చర్చ నడుస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఓటింగ్ శాతం పెరిగినా తమ ఎటువంటి ఢోకా ఉండదని టిడిపి వర్గాలు ధీమా వ్యక్తంచ చేస్తున్నాయి. వైసిపికి చెందిన ఓట్లే చీలుతాయని వారు అంచనాలు వేసుకుంటున్నారు. తమకేమీ నష్టం లేదని వైసిపి నాయకులు బయటకు చెప్తున్నా, అంతర్లీనంగా వారిలో కొంత ఆందోళన కనిపిస్తోంది. వైసిపి ఓటు బ్యాంకు కొంత దెబ్బతింటుందని, ముఖ్యంగా క్రిస్టియన్ మైనార్టీలు గతంలో గంపగుత్తగా వైసిపికి వేయగా ఈ సారి చీలుతాయని పలువురు విశ్లేషిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఉన్న రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే శ్రీకాకుళం, పలాస, నరసన్నపేట నియోజకవర్గాల్లో టిడిపి, వైసిపికి మధ్య గట్టి పోటీ ఉంటుందని చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ భారీగా ఓట్లు సాధించగలితే వైసిపి అభ్యర్థులకు కొంత ఇబ్బందిగా ఉండొచ్చనే చర్చ నడుస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ వైసిపి నుంచి కాంగ్రెస్‌లోకి భారీగా వలసలు ఉంటాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే ఇచ్ఛాపురం పర్యటనలో వైసిపి నుంచి కొంతమేర సహకారం లభించిందన్న ప్రచారం సాగుతోంది. ద్వితీయ స్థాయి నాయకులను, కార్యకర్తలను నాయకులే సమావేశానికి పంపినట్లు తెలిసింది. ఇచ్ఛాపురంలో వైసిపి ఎంపిటిసి స్వయంగా హాజరయ్యారు. ఎన్నికల సమయానికి వైఎస్‌ఆర్ అభిమానులు, వైసిపిలో అసంతృప్తులు, ద్వితీయ శ్రేణి నాయకులు కార్యకర్తలు రాబోవు రోజుల్లో కాంగ్రెస్‌లోకి వస్తారని జిల్లా పార్టీ నాయకత్వం అంచనా వేస్తోంది.

కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే ఆశావహుల నుంచి ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ మొదలు కాగా, జిల్లా నుంచే అధికంగా 12 వరకు దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. ఎచ్చెర్ల, పాతపట్నం, ఆమదాలవలస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల నుంచి పోటీకి సై అంటూ కొందరు ఆశావహులు దరఖాస్తు చేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి గతంలో పోటీ చేసిన ఓ ముఖ్య నాయకుడు దరఖాస్తు చేసినట్లు సమాచారం. ఆమదాలవలస నియోజకవర్గం నుంచి వైసిపి తరుపున పోటీకి ప్రయత్నిస్తున్న ఓ నాయకుడు కాంగ్రెస్‌కూ దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఫిబ్రవరి మొదటి వారంలో ఊపందుకోనుందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో మరింత మంది ఆశావహుల పేర్లు బయటకు రానున్నాయి. కాంగ్రెస్‌లో భవిష్యత్ లేదని గతంలో ఆ పార్టీ నుంచి బయటకు వెళ్లిన వారిలో కొందరు వైసిపిలో ఇమడలేకపోతున్నారు. టిడిపిలోనూ చేరేందుకు ఇష్టపడటం లేదు. అటువంటి వారంతా కాంగ్రెస్ పార్టీలో తిరిగి చేరొచ్చని కాంగ్రెస్ పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉందనే పరిస్థితులు వస్తే మాత్రం వైసిపికి చెందిన పెద్ద నేతలే కాంగ్రెస్‌లో చేరొచ్చని కాంగ్రెస్ పార్టీ నాయకులు భావిస్తున్నారు. జిల్లాలో త్వరలో షర్మిల బస్సు యాత్ర ఉంటుందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. జిల్లాలోని దాదాపు అన్ని నియోజకవర్గాలను చుట్టుముట్టేలా పర్యటన ఉంటుందని చెప్తున్నారు. ఆ తర్వాత డిసిసి అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు ఆధ్వర్యాన్న నియోజకవర్గాల వారీగా పాదయాత్ర చేపడతారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. బస్సు యాత్ర, పాదయాత్రలతో పార్టీ బలం పెరిగితే కచ్చితంగా వైసిపి నేతల చూపు కొంత కాంగ్రెస్ పార్టీ వైపు ఉంటుందన్న చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో పిల్ల కాంగ్రెస్‌ను వదిలి తల్లి ఒడికి ఎవరు చేరుతారనే అంశం కాంగ్రెస్ పార్టీకి పెరిగే బలంపై ఆధారపడి ఉంది.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ అయినటువంటి యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా, కిల్లిపాలెం బ్రాంచ్, శ్రీకాకుళం, బ్రాంచ్ మేనేజర్ వారు ఇచ్చిన బోగట్టపై ఈ బహిరంగ ప్రకటన.

నా క్లయింట్ కస్టడీలో ఉన్నటువంటి రీజిస్ట్రీ క్రయ చీటీ తేదీ 11-07-2013 డాక్యుమెంట్ నెంబర్ 4820/2013 ఆఫ్ ఎస్.ఆర్.ఓ శ్రీకాకుళం, కిల్లిపాలెం బ్రాంచ్ రేనోవేషన్ జరుగుతన్న సమయములో కనించకుండా పోయినది. కావున ఈ బహిరంగ ప్రకటన మూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, సదరు పైన పేర్కొన్న రీజిస్ట్రీ క్రయ చీటీ తేదీ 11-07-2013 డాక్యుమెంట్ నెంబర్ 4820/2013 ఆఫ్ ఎస్.ఆర్.ఓ. శ్రీకాకుళం, ఒరిజినల్ డాక్యూమెంట్ ఎవరికైనా దొరికిన యెడల, సదరు బ్రాంచ్ మేనేజర్ వారికి నేరుగా గాని లేదా నాకు గాని అప్పగించవలసందిగా మిక్కిలి వినయ పూర్వకంగా ప్రార్థిస్తున్నాను.

వడిగి.నాగేశ్వరరావు
అడ్వకేట్, శ్రీకాకుళం,ఫోన్: 9441021919.

యూనిఫారాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

మహిళా సంఘాల సేవలు విస్తృతం

ప్రజాశక్తి- రణస్థలం

స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల, జి.సిగడాం మండలాలకు చెందిన వెలుగు సిసి, సిఎఫ్‌లకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తన సొంత నిధులతో యూనిఫారాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలకు వీరు అందించే సేవలు అమోఘమైనవన్నారు. సిసిలు, సిఎఫ్‌లు ఒకేరంగు దుస్తులు ధరించి చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా కలిసికట్టుగా పనిచేసి మహిళా సంఘాలకు మరింత సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో రణస్థలం మండలం ఎపిఎం వెంకటరత్నం, రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల మండలం మహిళా అధ్యక్షురాలు రామితెట్టి లక్ష్మి, కొమ్ము కళావతి, పైడి శ్రీలత, ఎచ్చెర్ల మండలం కోశాధికారి రాపర్తి ఈశ్వరమ్మ, సిసిలు, సిఎఫ్‌లు పాల్గొన్నారు.

మనోహర్ దృష్టికి విలేకరి మృతి వివరాలు

ప్రజాశక్తి- లావేరు

మృతి వివరాలను తెలుసుకుంటున్న మనోహర్

లావేరు మండలం సాక్షి రిపోర్ట్ గురిజా దామోదరరావు ఆత్మహత్యకు గల కారకులపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారని మృతుడు సోదరుడు గురిజా శ్రీనివాసరావు తెలిపారు. జనసేన రాష్ట్ర కార్యాలయం నుంచి తమకు పిలుపు వచ్చిందని తాను మంగళగిరిలో పార్టీ కార్యాలయంలో నాదెండ్ల మనోహర్‌ను శనివారం కలిసినట్లు చెప్పారు. కేసుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని, పత్రాలను నాదెండ్ల తీసుకుని తమదగ్గర వివరాలను తెలుసుకొని బాధిత రిపోర్ట్ బాధితునికి జనసేన పార్టీ అండగా ఉంటుందని, జనసేన రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని మనోహర్ తెలిపినట్లు చెప్పారు. ఇటువంటి అరాచకాలు చేసేన వారిపై కఠిన చర్యలు తీసుకునే వరకు జనసేన పోరాటం చేస్తుందని, పోలీసులు కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినట్లు తెలిపారు.

ఆర్థికసాయాన్ని అందజేస్తున్న యూనియన్ నాయకులు

అంగన్వాడీలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అంగన్వాడీల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి 42 రోజులు సమ్మె చేసి ఎన్నో నిర్బంధాలు ఎదుర్కొని పోరాడి విజయం సాధించారని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్ ఉద్యమాల్లో కార్మికులు భాగస్వాములు కావాలని సిఐటియు ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు పేర్కొన్నారు. నాగార్జున అగ్రికం స్టాఫ్ అండ్ వర్కర్సు యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీల పోరాటానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారికి అండగా నిలిచేందుకు నాగార్జున అగ్రి కం స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఉద్యోగులు కార్మికుల నుంచి వసూలు చేసిన సంఘీభావనిధి ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణికి రూ.15,000 శనివారం అందజేశారు. కార్యక్రమంలో నాగార్జున అగ్రికమ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.అశోక్, వై.గోపాలుడు, సహాయ కార్యదర్శి ఎచ్చెర్ల రాజు, పి.సుధాకర్‌బాబు, ఉపాధ్యక్షులు చక్రధర్ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ రామారావు, ఎంపిపి ప్రతినిధి ప్రకాష్

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి- కవిటి

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన తప్పనిసరని ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. మండలం శవసానపుట్టుగలో జెడ్‌పి నిధులు రూ.5 లక్షలతో సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో మారుమూల గ్రామాలకు కూడా పూర్తిస్థాయిలో రహదారి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి నర్తు చామంతి, నర్తు శివాజీ, స్థానికులు పాల్గొన్నారు.

సమావేశంలో తెలగ కుల సంఘం ప్రతినిధులు

యాత్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఉత్తరాంధ్ర తెలగ జాతి ఆత్మ గౌరవ యాత్ర విజయవంతం చేయడానికి సమిష్టిగా కృషి చేయాలని సమావేశంలో కులపెద్దలు నిర్ణయించారు. శనివారం స్థానిక తెలగకుల సంఘం ప్రతినిధులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి తెలగజాతి ఆత్మగౌరవ యాత్ర ఇచ్ఛాపురం నుంచి ప్రారంభం కానుందని, ఉత్తరాంధ్ర తెలగ నాయకులు పల్లంట్ల వెంకట రామారావు ఈ పాదయాత్రను నిర్వహిస్తున్నారన్నారు. ఈ పాదయాత్ర ఉదయం 12 గంటలకు ఇచ్ఛాపురం గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం తెలగకుల ప్రజలతో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. పాదయాత్ర ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు సాగుతుందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- నౌపడ

నౌపడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను ఆదివారం నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ ఎం.శివకుమార్ శనివారం తెలిపారు. ఫీడర్ మెయింటెనెన్స్ వర్క్ చేపడుతున్నామని, ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు నిలుపుదల ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

ఆమదాలవలస : 33/11 కెవి ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కెవి వెంగళరావు కాలనీ ఫీడర్ మరమ్మతుల్లో భాగంగా ఆదివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్తారు బయ్యన్నాయుడు ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వెంగళరావు కాలనీ, ఎస్ఎస్-3 ట్రాన్స్ఫార్మర్ గేటు ఏరియా, పాత ఆమదాలవలస, టిఎస్ఆర్ కాలేజీ రోడ్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని పేర్కొన్నారు. ఈ అసౌకర్యాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

వచ్చే ఎన్నికల్లో టిడిపిదే గెలుపు

సరుబుజ్జిలి : మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి సిఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసి ప్రజల సంక్షేమానికి బాటలు వేయనున్నారని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. శనివారం మండలంలో కొత్తకోట గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు నిర్లక్ష్యంగా ఉండొద్దని, ప్రజల వద్దకు వెళ్లి వైసిపి అరాచకాలను, లోపాలను వివరించాలని కార్యకర్తలకు హితబోధ చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి లేదని, అరాచకాలు పెరిగిపోయాయని ఎద్దేవా చేశారు. గ్రామాల్లో టిడిపి అధికారంలోకి వచ్చాక ప్రజలకు అందించే సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను విపులంగా వివరించాలని, ప్రజలందరూ టిడిపి వైపు చూస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమం టిడిపితోనే సాధ్యమని నమ్ముతున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యం, పల్లి సురేష్, కిల్లి సిద్దార్థ, సురవరపు జగదీష్, పేడాడ మణి, యువ నాయకులు నూక ప్రభాకరరావు, తాడేల రాజారావు పాల్గొన్నారు.

ఆమదాలవలస: ప్రజలే రాష్ట్రాన్ని కాపాడుకోవాలని టిడిపి జిల్లా న్యాయ విభాగ నాయకులు తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. శనివారం టిడిపి కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో అత్యధిక అప్పుల రాష్ట్రంగా మారిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 23 వార్డుల్లో టిడిపి కుటుంబ సభ్యులందరూ ఐకమత్యంగా పనిచేసి వైసిపి అసమర్థత పాలనను ప్రజలకు వివరించి ఎన్నికల్లో టిడిపి విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, పట్టణ అధ్యక్షుడు సంపదరావు మురళీ, కూన అప్పలనాయుడు, బి.వి.రమణమూర్తి, బోర గోవిందరావు, తంగి గురయ్య, నాగళ్ల మురళీధర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పొందూరు: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో వైసిపి దుష్టపాలనను అంతమొందించి ప్రజలకు సుపరిపాలన అందించడానికి టిడిపి విజయానికి సైనికుల్లా పోరాడాలని టిడిపి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిఎంజె.బాబు అన్నారు. మండల కేంద్రంలో టిడిపి కార్యాలయంలో మండలపార్టీ అధ్యక్షులు రామ్మోహన్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కూన సత్యనా రాయణంంంంంంంం ఆధ్వర్యంలో శనివారం

పొందూరు : సమావేశంలో మాట్లాడుతున్న పిఎంజె.బాబు

నాయకులు, కార్యకర్తల తో ఎన్నికల సన్నద్ధతపై సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో డబ్బు, అధికారంతో అధికారపార్టీ నాయకులు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు అన్నెపు రాము, వండాన మురళీ, గాడు నారాయణరావు, సీపాన శ్రీరంగ నాయకులు, బలగ శంకర భాస్కర్, బాడాన శేషగిరి, చింతాడ వాసుదేవరావు, అనకాపల్లి చినరంగ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

పలాస : టిడిపి నాయకులతో శిరీష

పలాస: రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం ప్రారంభమైందని, అందరూ సిద్ధంగా ఉండాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పిలుపునిచ్చారు. మందస, హరిపురం పార్టీ కార్యాలయాల్లో నూతన ఓటరు జాబితాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త ఓటర్లును చేర్చాలన్నారు. కొత్త ఓట్లు చేర్చినప్పుడే గెలుపుతో పాటు మెజారిటీ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రతిఒక్కరు టిడిపి ఓటర్లను కలుపుకుంటూ కొత్త ఓట్లుపై దృష్టి పెట్టాలన్నారు. ఫిబ్రవరిలో యువనేత నారా లోకేష్ పర్యటన ఉంటుందన్నారు. కార్యక్రమంలో మందస మండల అధ్యక్షుడు దుర్యోధన, జి.కె నాయుడు, రుద్రయ్య, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలు, నాయకులు పాల్గొన్నారు.

రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి- బూర్జ

మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన గ్రామసభలో రూ.60 లక్షల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నట్లు సర్పంచ్ వేగు అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో 40 పనులను గుర్తించామన్నారు. ఇప్పటికే వీటికి అవసరమైన ఎస్టిమేషన్లు వేయడం జరిగిందన్నారు. ఈ పనులను త్వరలో చేపట్టనున్నామని తెలిపారు. ఈ సభలో కార్యదర్శి బి.కిరణ్‌కుమార్, సంతోష్, హెల్త్ సూపర్‌వైజర్ సరోజిని, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నేడు రగ్బీ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి

ఫిబ్రవరి 3, 4 తేదీల్లో విశాఖజిల్లా భీమిలి పట్టణంలో జరగనున్న రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు సంబంధించి జిల్లా స్థాయి జట్టు ఎంపిక స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించనున్నామని నిర్వాహక కార్యదర్శి బాడాన నారాయణరావు ప్రకటనలో తెలిపారు. అండర్-14 బృందాన్ని ఎంపిక చేయనున్నామని తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపికలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఎంపికకు హాజరైన క్రీడాకారులు ఆధార్ కార్డు, ఫోటోలు, జనన ధ్రువీకరణ పత్రం తీసుకుని హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 8500007272 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న రామకృష్ణ

వైసిపి అవినీతిపై ప్రచారం చేయాలి

బూర్జ: వైసిపి ప్రభుత్వం, ఆపార్టీ నాయకులు చేస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలపై ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్‌పిటిసి అనెపు రామకృష్ణ నాయుడు పేర్కొన్నారు. శనివారం కొల్లివలస టిడిపి కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణకు సంబంధించి సిబ్బందితో మాట్లాడుతూ సాంకేతిక విధానం పార్టీ ప్రతిష్టకు ఏ విధంగా ఉపయోగపడుతుందో తెలియజేశారు. ఇంటిగ్రేటెడ్ శిక్షణ ద్వారా అనేక ఫలితాలు పొందబోతున్నామని చెప్పారు. యాప్ ఉపయోగించి సమస్యను పార్టీ అగ్ర నాయకులకు చేరేందుకు వీలుగా ఉంటుందని వివరించారు. ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకొని పార్టీ పటిష్టతకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు వి.రాంజీ, ప్రధాన కార్యదర్శి జగన్నాథ నాయుడు, మొదలవలస రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

8న విజయవాడలో 'ఆశా'ల ధర్నా

ప్రజాశక్తి- కొత్తూరు

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఫిబ్రవరి 8న విజయవాడలో ధర్నా చౌక్ వద్ద మహధర్నా కార్యక్రమం జయప్రదం చేయాలని ఆశవర్కర్ల యూనియన్ నాయకులు పి.జయలక్ష్మి, ఎస్.గౌరమ్మ. కె.జ్యోత్స్న పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమస్యలను పరిష్కారం చేయాలని, వేతనాలు పెంచాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు సిర్ల ప్రసాద్, పద్మ, నిర్మల, కాంతమ్మ, సరోజని, లక్ష్మీ, శ్రీలక్ష్మీ, సుశీలమ్మ పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సత్కారం

ప్రజాశక్తి- నందిగాం

న్యూఢిల్లీలో పంచాయతీరాజ్ మంత్రి గిరి రాజ్‌సింగ్, కపిల్ మోరేశ్వర్ పాటిల్ చేతులమీదుగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన 13 మంది సర్పంచ్‌ల్లో ఒకరైన నందిగాం సర్పంచ్ జద్యాడ రమణమ్మకి మంత్రి మెమొంటో సాల్వాతో సత్కరించారు. జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి, ఎపి నోడల్ ఆఫీసర్ ఎస్ఎస్ మూర్తి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి- కవిటి

స్థానిక బెహరావీధిలో పున:నిర్మిస్తున్న శ్రీ జగన్నాథస్వామి ఆలయ నిర్మాణానికి విశాఖకు చెందిన రోహన్ కుమార్ రూ.50వేలు ఆలయకమిటీ సభ్యులకు అందించారు. కవిటిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి ఇప్పటికే రూ.50వేలు అందించిన రోహన్ కుమార్ శనివారం రెండు ఆలయాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తరాలుగా వస్తున్న మన వారసత్వ సంపద కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత డిఎస్‌పి ఎస్‌వివి ప్రసాదరావు, మొగిలిపురి సీతాలు, పూడి కిరణ్ కుమార్, బిపి రెడ్డి, గిరి బెహరా, తిరుపతి బెహరా, సంతు బెహరా, ఖగపతి బెహరా, త్రినాథ్ బెహరా పాల్గొన్నారు.

బస్సులు లేక ఇక్కట్లు

ప్రజాశక్తి- టెక్కలి

సిఎం జగన్మోహన్‌రెడ్డి భీమిలిలో శనివారం ఏర్పాటు చేసిన సిద్ధం సమావేశానికి టెక్కలి ఆర్‌టిసి డిపో నుంచి బస్సులు వెళ్లిపోవడంతో ప్రయాణీకులు పలు అవస్థలు పడ్డారు. డిపో నుంచి సుమారు 29 బస్సులు సమావేశానికి తరలించారు. టెక్కలి డిపో నుంచి 55 రూట్లులో సుమారు 60 బస్సులు తిరుగుతుంటాయి. సగం బస్సులు భీమిలి వెళ్లడంతో బస్సులు లేక ప్రయాణికులు ఇక్కట్లు పడ్డారు. డిపో పరిధిలో ప్రధానమైన మార్గాల్లో బస్సులను నడిపించారు. బస్సులు తిరగకపోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. అత్యవసర ప్రయాణాలు చేయాల్సిన వారు బస్సులు లేక యాతన పడ్డారు.

ఆమదాలవలస : భీమిలిలో సిఎం జగన్మోహన్ రెడ్డి బహిరంగ సభకు జిల్లాలో ఆర్‌టిసి బస్సులు కేటాయించడంతో ప్రజలు, విద్యార్థులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అరకొర బస్సులు తిరగడంతో గమ్యస్థానాలకు చేరుకోలేక చాలామంది విద్యార్థులు, ప్రజలు అవస్థలు పడ్డారు. వైఎస్ఆర్ జంక్షన్ వద్ద శ్రీకాకుళం వెళ్లేందుకు బస్సులు లేక ప్రయాణికులు బస్సుషెల్టర్‌లో గంటల తరబడి వేచిచూసి చివరకు ఇంటిబాట పట్టారు.

ఆమదాలవలస : బస్సుల కోసం వేచి చూస్తున్న విద్యార్థులు, ప్రజలు

'ఆరోగ్య సురక్ష' పేదలకు వరం

మెళియాపుట్టి : సురక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని ఎంపిడిపి పి.చంద్రకుమారి అన్నారు. మండలంలో జాడుపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అనారోగ్యంతో బాధపడే వారికి కావాల్సిన పరీక్షలు, మందులు అందించడంతో పాటు ఆపరేషన్లు చేయాల్సి వస్తే తగిన సహకారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శివాజీ, వైద్యాధికారులు హేమంత్, లక్ష్మి, పావని, గ్రీష్మ, అధికారులు, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కవిటి: ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా పల్లెపల్లెకు వైద్యసేవలు విస్తరిస్తున్నట్టు సర్పంచుల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, ఎంపిటిసి పూడి నీలాచలం తెలిపారు. కవిటి సచివాలయం-1 పరిధిలో శనివారం ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు శశిధర్, ఎస్ఎస్ వైష్ణవి కుమారి, ఎ.లక్ష్మణ్ సాయి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అదేవిధంగా నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇఒ వీరభద్రస్వామి, రాజపురం పిహెచ్‌సి వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

'వైసిపిది అధికార దుర్వినియోగం'

పలాస: వైసిపి అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు ఆరోపించారు. రాష్ట్ర బిసిసెల్ ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ నెల్లిమర్లలో యువగళం ముగింపుసభకు ఆర్‌టిసి బస్సులకు వినతిపత్రం అందించినా ఇవ్వని అధికారులు భీమిలిలో వైసిపి సిద్ధం కార్యక్రమానికి పలాస డిపో నుంచి 50 బస్సులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. టిడిపికి బస్సులు కేటాయిస్తే ఆర్‌టిసి లాభపడేదని, ఇప్పుడు వైసిపి అధికారానికి నష్టపోతుందని విమర్శించారు. సమావేశంలో లొడగల కామేశ్వరరావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, టంకాల రవిశంకర్ గుప్తా, చక్రధర్, గోల చంద్రరావు, హనుమంతు మురళీమోహన్, కొత్త సత్యం, భీమారావు పాల్గొన్నారు.

వైసిపి అధికార దురాగతాలకు పాల్పడుతుందని జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఆర్‌టిసి బస్సులు కేటాయించాలని కోరితే విస్మరించిన అధికారులు వైసిపి సభలకు ఎలా బస్సులు ఇచ్చారని, ఇది పక్షపాత వైఖరి కాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ కుమార్, ప్రధాన కార్యదర్శి సంతోష్, అవుగాన దశరథుడు, కుత్తుం రామ్ పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

తప్పుడు సర్వే హద్దుల నివేదికలు ఇచ్చి దళితులపై దాడులకు కారకులైన మండల సర్వేయర్, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకొని, సమగ్ర సర్వే చేసి కొండ ఫోరంబోకు ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని దళిత హక్కుల పోరాట సమితి, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల తహశీల్దార్ కార్యాలయం ముందు డిహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో తులసిపేట దళితులు నిరవధిక నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో సమాచారహక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా అధ్యక్షులు అనపాన షణ్ముఖరావు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు పాల పోలారావు, డిహెచ్‌పిఎస్ జిల్లా నాయకులు చిట్టి సింహాచలం మాట్లాడుతూ చిట్టివలస రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబరు 198లో వండాన రాజేశ్వరమ్మ 431/1986 ద్వారా 0.42 1/2 సెంట్లు భూమి కొనుగోలు చేసి సాగు చేస్తున్నారని, అటువంటిది 0.80 సెంట్లు భూమికి ఎలా సర్వే హద్దులు నిర్ణయిస్తారని ప్రశ్నించారు. ఎదురుగా ఉన్న కొండ ఫోరంబోకు సర్వే నెం.196లో 0.37 1/2 సెంట్లు భూమి ఆక్రమణదారులకు దారాదత్తం చేయడానికి కింది స్థాయి సిబ్బంది తప్పుడు నివేదిక అందిస్తే ఎటువంటి డాక్యుమెంట్స్ పరిశీలించకుండా హద్దులు నిర్ణయిస్తూ అధికారులు ఎలా జారీ చేశారన్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి సమగ్రమైన దర్యాప్తు చేసి, తప్పుడు నివేదికలు ఇచ్చిన సర్వేయర్, ఇతర అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమంగా తొలగించిన పందుల షెడ్లు నిర్మించి దళితులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. నేటి నుంచి న్యాయం జరిగే వరకు తహశీల్దార్ కార్యాలయం ముందు నిరవధిక నిరసన దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి డివిజన్ నాయకులు లోపింటి మనోహర్, కొల్లి శ్రీను, అప్పన్న, కోతి వేణు, చిట్ట రేవతి, కొల్లి లక్ష్మీ, నరసమ్మ, తోట చిన్నారావు, బొంతల నీలయ్య పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు

టిడిపితోనే బిసిలకు న్యాయం

మాట్లాడుతున్న ఎంపీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

టిడిపి హయంలోనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరిగిందని, అధిక సంఖ్యలో బిసిలకు పదవులు కల్పించి ఆర్థిక, సామాజిక, రాజకీయాల్లో పెద్దపీట వేశామని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. నగరంలో జయహో బిసి బైక్ ర్యాలీని శనివారం నిర్వహించారు. అరసవల్లి నుంచి బలగ వరకు సాగింది. జయహో బిసి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వాన తిరిగి రాష్ట్రంలో విజయం సాదిస్తామని ధీమా వ్యక్తం చేశారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, పి.ఎం.జె.బాబు, నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చిట్టి నాగభూషణం, పార్టీ నాయకులు రెడ్డి శివన్నారారాయణ, రెడ్డి చిరంజీవులు, ఉంగటి రమణ, జామి భీమశంకరరావు పాల్గొన్నారు.

నిరుద్యోగులను వంచిస్తున్నారు

టెక్కలి: వైసిపి ప్రభుత్వం నిరుద్యోగులను వంచిస్తుందని, యువతకు వాస్తవాలను వివరిస్తు వారిలో చైతన్యం తీసుకు వచ్చేందుకు ఈ నెల 29న విజయవాడలో జరగనున్న యంగ్ ఇండియా సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మెజ్జాడ యుగంధర్ పిలుపునిచ్చారు. శనివారం టెక్కలిలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్రం, రాష్ట్రంలో పలు కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కిషోర్, సూర్య, మహేష్, పృధ్వీ, గణేష్ పాల్గొన్నారు.

బస్సు కింద పడి క్లీనర్ దుర్మరణం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

భీమిలిలో నిర్వహించే నేను సిద్ధం జగనన్న ఎన్నికల శంఖారావం కోటబొమ్మాళిలో శనివారం ఒక నిండు ప్రాణాన్ని బలిగొంది. సిఎం జగన్మోహన్ రెడ్డి భీమిలిలో నిర్వహించనున్న నేను సిద్ధం జగనన్న కోసం అనే కార్యక్రమానికి కోటబొమ్మాళి నుంచి ఏడు బస్సులు కేటాయించారు. అందులో ఒక బస్సు స్థానిక కొత్తమ్మ తల్లిని దర్శించుకుని బయలుదేరింది. కొన్ని నిమిషాల వ్యవధిలోనే స్థానిక ఇండియన్ బ్యాంక్ సమీపానికి వచ్చేసరికి బస్సు ముందు డోర్ వద్ద నిల్చుని ఉన్న క్లీనర్ శ్రీకాకుళం రూరల్ మండలం కుశాలపురం గ్రామానికి చెందిన ఉప్పాడ లక్ష్మణరావు(48) అదుపుతప్పి కాలుజారి పడిపోవడంతో బస్సువెనుక టైరు లక్ష్మణరావు తలపై నుంచి వెళ్ళిపోయింది. దీంతో లక్ష్మణరావు అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే డ్రైవర్, క్లీనర్ ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు కావటం గమనార్హం. వెంటనే సమాచారం తెలుసుకున్న ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడుకు భార్య శాంతికుమారి, కుమార్తె పవిత్ర, కుమారుడు జగదీష్ ఉన్నారు.

మేడపై నుంచి పడి బాలుడు మృతి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

స్థానిక కొత్తపేట ఇందిరమ్మ కాలనీకి చెందిన నీలాపు లీలా మోహన్ (15) మేడపై నుంచి జారిపడి మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు. ఈనెల 24వ సాయంత్రం లీలామోహన్ తమ మేడపై ఆడుకుంటూ కాలు జారిపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి చికిత్సకోసం తరలించగా అక్కడ వైద్యులు సూచన మేరకు మెరుగైన వైద్యంకోసం విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు. ఈ మేరకు తన తండ్రి నీలాపు రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గరవ్నర్‌తో మాట్లాడుతున్న ప్రసాదరావు

బెజ్జిపురం యూత్‌క్లబ్‌కు గవర్నర్ ఆతిథ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తన రాజభవన్‌లో నిర్వహించిన ఎట్ హోమ్ కార్యక్రమానికి యూత్‌క్లబ్ ఆఫ్ బెజ్జిపురం బృందం హాజరైంది. నాలుగు దశాబ్దాలుగా మహిళల స్వయం ఉపాధికి విశేష కృషి చేసిన యూత్ క్లబ్ ఆఫ్ బెజ్జిపురం సంస్థను దేశ ప్రధాని నరేంద్రమోడీ గుర్తించి మనకీబాత్ కార్యక్రమంలో కొనియాడారు. ప్రతి ప్రాంతంలో మహిళల సాధికారిత కోసం ఇలాంటి ప్రయత్నం నిరంతరాయంగా జరగాలని ఆకాంక్షించారు. ఈ క్రమంలో గణతంత్ర దినోత్సవ వేళ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ వివిధ రంగాల ప్రముఖులకు ఇచ్చిన ఆతిథ్యానికి యూత్‌క్లబ్ ఆఫ్ బెజ్జిపురం వ్యవస్థాపకులు ఎం.ప్రసాదరావు, జి.అప్పలనాయుడు పాల్గొన్నారు. యూత్ క్లబ్ ఆఫ్ బెజ్జిపురం చేసిన ప్రయత్నాన్ని గవర్నర్ అభినందించారు. మహిళల స్వయం సమృద్ధి ద్వారా దేశంలో ఆర్థిక అసమానతలు తొలగి మహిళా సాధికారిత సాకారం అయ్యేందుకు యూత్‌క్లబ్ ఆఫ్ బెజ్జిపురం పటిష్టమైన రహదారి చూపించిందని గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. తమ సంస్థకు గుర్తింపు లభించడంతో పాటు అధికారులు, ప్రభుత్వ అధినేతలు ప్రోత్సహించడం ఎంతో శక్తిని ఇచ్చిందని యూత్‌క్లబ్ ఆఫ్ బెజ్జిపురం వ్యవస్థాపకులు ప్రసాదరావు తెలిపారు.

జోహార్‌ఖాన్ తనయుడు మృతి

ప్రేమ్ సర్తజ్ ఖాన్ (ఫైల్)

ఇచ్ఛాపురం: స్థానిక విజ్ఞానభారతి విద్యా సంస్థల కార్యదర్శి జోహార్‌ఖాన్ తనయుడు ప్రేమ సర్తాజ్ ఖాన్(41) గుండెపోటుతో శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు. ప్రేమ సర్తాజ్‌ఖాన్ జ్ఞానభారతి స్కూల్ పరిపాలన అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం కరణం వీధిలోని జోహార్ ఖాన్ నివాసం వద్ద నుంచి ప్రేమ్ సర్తాజ్ ఖాన్ అంతిమయాత్ర నిర్వహించారు. జోహార్ ఖాన్ తనయుడు అకాల మరణం పట్ల సహచర విద్యా సంస్థలకు చెందిన పలువురు సంతాపం వ్యక్తం చేశారు. శనివారం ప్రేమ్ సర్తాజ్ ఖాన్ మృతి పట్ల ప్రైవేటు విద్యా సంస్థలు బంద్‌కు పిలుపు నిచ్చింది. స్వర్ణ భారతి విద్యా సంస్థల చైర్మన్ తులసీ దాస్ రెడ్డి అధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపక బృందం రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ప్రేమ్ మృతి పట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ చైర్మన్‌లు భారతి దివ్య, లాభాల స్వర్ణమణి, పలువురు వార్డు కౌన్సిలర్‌లు సంతాపం తెలిపారు.

మాజీ ఎంపిపి బాబ్జీ మృతి

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం మండల పరిషత్ మాజీ అధ్యక్షులు మూకళ్ల బాబ్జీ (55) శనివారం ఉదయం తన స్వగ్రామం కళ్లేపల్లిలోని ఇంటివద్ద మృతి చెందారు. మృతి వార్తను తెలుసుకున్న మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, ఆయన కుమారుడు కాలిఫోర్నియా స్టేట్ ఎనర్జీ కమిషనర్ వైస్‌చైర్మన్ గుండ శివ గంగాధర్, టిడిపి మండల అధ్యక్షులు శీర రమణయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, గార ఎంపిపి గొండు రఘురాం, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, రాగోలు సర్పంచ్ గేదెల చెంగలరావు, కళ్లేపల్లి సర్పంచ్ గంగు నాగరత్నం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముకళ్ల శ్రీనివాస్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఎంపిటిసి బలగ చెంగలరావు, నియోజకవర్గ బిసి అధ్యక్షులు గేదల శ్యామలరావు, ఎంపిటిసి మంగమ్మ, మాజీ ఎంపిపి చిట్టి జనార్ధన, తంగి శివ ప్రసాద్, గంగు నరేంద్ర మృతదేహం వద్ద నివాళ్లర్పించారు.

సిఐ బాధ్యతల స్వీకరణ

టెక్కలి రూరల్ : టెక్కలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి.పైడియ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణే తన ప్రథమ కర్తవ్యమని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. టెక్కలి స్టేషన్ ఎస్ఐ ఎల్.రామకృష్ణ ఉదోగోన్నతిపై బదిలీ అయ్యారు.

రక్తదానం చేస్తున్న యువకులు

రక్తదానం గొప్పది

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అన్ని దానాల్లో కన్నా రక్తదానం గొప్పదని జనసేన పార్టీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త వి.దుర్గారావు అన్నారు. శనివారం పల్లిసారధి గ్రామంలో రక్తదాత స్వచ్ఛంద సంస్థ, జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాలు కోల్పోయే స్థితి నుంచి ఎంతోమంది ప్రాణాలను రక్షించవచ్చునని, రక్తదానం చేయడంవలన కొత్త జీవితాన్ని ప్రసాదించవచ్చన్నారు. ఉద్దానం కిడ్నీ వ్యాధిగ్రస్తులకు 200 పడకల ఆస్పత్రి నిర్మించినప్పటికీ బ్లడ్‌బ్యాంక్ లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న రోగులు రక్తం అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. బ్లడ్ బ్యాంకుల్లో తగిన నిల్వలు వుండేలా చూసే బాధ్యత అందరిపై ఉందన్నారు. రక్తదానం చేసిన పోతనపల్లి మోహనరావు, సతీష్, మోహన్, అఖిల్, రవి, పథ్వి, పాపారావు, రాహుల్ తదితరులను అభినందించారు. కార్యక్రమంలో యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ప్రయివేట్ ఎలక్ట్రీషియన్లు

సబ్సిడీతో పనిముట్లు అందించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్‌కు ప్రభుత్వం సబ్సిడీతో పనిముట్లు అందించాలని ఆ సంఘ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. ఎలక్ట్రీషియన్ డే సందర్భంగా శనివారం పట్టణంలో పాలపోలమ్మ గుడి దగ్గర నుంచి మెయిన్ రోడ్ మీదుగా వన్ వే జంక్షన్ వద్ద గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ థామస్ అల్వా ఎడిషన్ ఈరోజున బల్బు కనుగొన్న రోజును ఎలక్ట్రిషన్ డేగా గుర్తింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆరేళ్లుగా కోరుతున్నా ప్రభుత్వాలు గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి జనవరి 27న ఎలక్ట్రీషియన్ డే గా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. గుర్తింపు పొందిన ఎలక్ట్రీషియన్లకు 60 ఏళ్లుదాటితే రూ.5 వేలు పింఛను ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ సంఘ సభ్యులు పి. చిన్నారావు, కె.హరిబాబు, పి.గున్నయ్య, ఫకీర్ నాయుడు, ఆర్.కృష్ణ, ఎల్.రామారావు, సలీం, రవి, తేజ పాల్గొన్నారు.

నేడు వన భోజనాలు

ప్రజాశక్తి- సోంపేట

మండలంలో బారువ గ్రామ ప్రధాన కూడలి వద్ద ఆదివారం అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం (పల్లి) ఆధ్వర్యంలో వనభోజనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధి తామాడ చంద్రశేఖరం తెలిపారు. శనివారం వనభోజన కార్యక్రమ ఏర్పాట్లను ఆయన సంఘ సభ్యులతో కలిసి పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి దోహదం చేసేలా కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్రస్థాయి నుంచి సంఘ పెద్దలు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నందున సభ్యులంతా హాజరవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వనభోజన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న తామడ చంద్రశేఖరం

'సిద్ధం' సభకు జనం తరలింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వైసిపి ఆధ్వర్యాన సిద్ధం పేరిట విశాఖ జిల్లా భీమిలిలో నిర్వహించిన సభకు తరలివెళ్తున్న ఆ పార్టీ కార్యకర్తల కోసం ఏర్పాటు చేసిన బస్‌లను రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం జెండా ఊపి ప్రారంభించారు. పెద్దపాడులోని ఆయన క్యాంపు కార్యాలయం వద్ద నుంచి ఈ బస్‌లను ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి 'సిద్ధం' నినాదంతో ఎన్నికల సభ నిర్వహిస్తుండడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ప్రజలు, కార్యకర్తలు తరలివెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహరనాయుడు, ఎం.వి.పద్మావతి, శిమ్మ రాజశేఖర్, అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, మండవల్లి రవి, పొన్నాడ రుషి పాల్గొన్నారు.

కొత్తూరు: భీమిలిలో శనివారం జరిగే వైసిపి సిద్ధం కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా వైసిపి కోశాధికారి, పాతపట్నం నాయకులు లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు, హిరమండలం ఎంపిపి ప్రతినిధి, మండల ప్రత్యేక ఆహ్వానితులు తూలుగు తిరుపతిరావు, పాతపట్నం జెడ్‌పిటిసి లింగాల ఉషారాణి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

సోంపేట : జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రామారావు, విజయ

సోంపేట: భీమిలిలో జరిగే వైసిపి సమావేశానికి సోంపేట మండలానికి చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీఎత్తున తరలివెళ్లారు. బస్సులను ఎమ్మెల్సీ నర్తు రామారావు, జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసేందుకు ఈ కార్యక్రమం జరగనుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలో 4 మండలాలకు చెందిన వైసిపి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే భవిష్యత్‌కు గ్యారంటీ

మెళియాపుట్టి : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కలమట

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలం పెద్దపద్మాపురం, చాపర, సుందరాడలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణమూర్తి శనివారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పోస్టర్లను అందజేశారు. రాష్ట్రంలో అరాచకాలకు అదుపు లేదన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక మోసపూరిత విధానాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి మహిళా ఉపాధ్యక్షురాలు బూర్ల లలిత కుమారి, సుందరాడ రామ్మోహన్, ఉర్లాన రుక్మందరరావు, దారపు దామోదర్, వసంత్, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: మండల కేంద్రమైన బూర్జలో టిడిపి నాయకుడు అనంతగిరి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి అధికారంలోకి వస్తే అందించే పథకాల పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు భోగిరాజు, బొంబాయి శ్రీను, జగదీష్, శ్రీధర్, బంగారి, ఈసు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

నిబద్ధతతో కూడిన సేవలే గుర్తింపునిస్తాయని తహాశీల్దార్ బి.అప్పలస్వామి అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పలాస ఆర్‌డిఒ చేతులుమీదుగా డివిజన్ స్థాయి ప్రతిభ పురస్కారాలు అందుకున్న పలువురు రెవెన్యూ సిబ్బందిని శనివారం తన కార్యాలయంలో పుష్పగుచ్చాలిచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురస్కారాలు ఉద్యోగిని మరింత ప్రోత్సహిస్తాయన్నారు. ఉత్తమ గ్రామ రెవెన్యూ అధికారిగా మడ్డు క్రాంతి(గునుపల్లి), కంప్యూటర్ ఆపరేటర్‌గా కంసు రాజేష్, రెడ్డి సిమ్మన్న, గ్రామ సర్వేయర్ ఎల్.సంతోష్ కుమార్ (దేవునల్తడ), బూత్ లెవెల్ అధికారులు కరణం ఇందిరా ప్రియదర్శిని, శ్రీనివాసరావు, ఉత్తమ గ్రామ సహాయకులు ఇప్పిలి కవిత, తుంగాన గున్నయ్యలకు పురస్కారాలు వరించాయి. కార్యక్రమంలో డిటి వి.గిరిరాజు, అర్‌ఐ పవిత్ర, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

పలాస : గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ సేవలకుగాను సామజిక ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న సీనియర్ సహాయకుడు దున్న శ్రీధర్ బాబు సేవలకు గుర్తింపుగా ఉత్తమ ఉద్యోగిగా జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అవార్డును ప్రధానం చేశారు. శ్రీధర్‌బాబుకు పురస్కారం రావడంతో జిల్లా సమన్వయాధికారి, కార్యాలయ సిబ్బంది, అసిస్టెంట్ ఫైనాన్స్ ఆఫీసర్, అడ్మనిస్ట్రేటివ్ ఆఫీసర్, జిల్లాలో ఉన్న సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, డిఇఒలు, ప్రేమ్ కుమార్, విజయ్ శుభాకాంక్షలు తెలిపారు.

వజ్రపుకొత్తూరు : పురస్కార గ్రహీతలతో రెవెన్యూ సిబ్బంది

జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతాంగాన్ని అన్నివిధాల ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వంకల పాపయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలం మద్రిపాడులో ఎఐకెఎంఎస్ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలకు జీవనాధారమైన జీడి, కొబ్బరి పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గిట్టుబాటు ధర పూర్తిగా పడిపోయిందని, రైతాంగం సంక్షోభంలో ఉన్నారని, రైతాంగ సమస్యలు తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల కోసం ఈ మహాసభల్లో చర్చించుకొని భవిష్యత్ కార్యాచరణ నిర్ధారించుకోవడానికి ఉమ్మడి గుంటూరు జిల్లా గురజాలలో ఫిబ్రవరి 3, 4 తేదీల్లో మహాసభలు జరగనున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా అధ్యక్షులు సొర్ర రామారావు, మురిపింటి యరకమ్మ, గూడ లక్ష్మమ్మ, కోణారి పాపయ్య, ముడిమించి కూర్మారావు, దుర్గారావు పాల్గొన్నారు.

బీమా నగదు అందిస్తున్న కోటేశ్వరరావు

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో 6వ వార్డు సిందిరివీధిలో మరణించిన గీలాయి హరి తల్లి బైరమ్మకు వైఎస్ఆర్ బీమా తక్షణసాయం కింద రూ.10వేలు నగదును శనివారం కౌన్సిలర్ ప్రతినిధి పి.కోటేశ్వరరావు అందించారు. మిగిలిన రూ.90 వేలు బ్యాంకు అకౌంట్‌లో జమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో పరపతి దానయ్య రెడ్డి, ఎల్ రమేష్, భగవాన్ రానా, దుర్యోదన్ పండితో, గంట యాదవరావు, సిందిరి యోగేష్, మరిడి భానువతి, సచివాలయం అడ్మిన్ జీన, వాలంటీర్ మణి పాల్గొన్నారు.

ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న మోహనరావు

విద్యాబోధనలో మార్పులు అవసరం

ప్రజాశక్తి- నందిగాం

మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాబోధనలో మార్పులు అవసరమని లఖిదాసుపురం సర్పంచ్ ప్రతినిధి మోహనరావు అన్నారు. ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 20 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చిలుకు కృష్ణారావు, మాజీ జడ్‌పిటిసి ప్రతినిధి మాదిన గోపాలకృష్ణ, పాఠశాల విద్యాశాఖ కమిటీ చైర్మన్ మాదిన సీతారాం, ఉపాధ్యాయులు బాలక రామారావు, తులసీప్రసాద్, రంకిణి రామారావు పాల్గొన్నారు.

గడ్డి, ఊక లారీలతో భయాందోళన

పరిమితికి మించి రవాణా

ప్రజాశక్తి- రణస్థలం

పరిమితికి మించి సరుకుతో వెళ్తున్న లారీలు ప్రయాణికులను భయాందోళ నకు గురి చేస్తున్నాయి. కొద్దిరోజులుగా 16వ నెంబర్ జాతీయ రహదారి, రామతీర్థాలు రోడ్డు, శివారు ప్రాంతాల్లో ఈ వాహనాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. వరిగడ్డి, ఊకను పరిమితికి మించి తీసుకెళ్తున్నాయి. ఈ భారీ వాహనానికి ఇరువైపులా ఊక వేలాడుతూ పక్కనుంచి వెళ్తున్న వాహనాలకు, ద్విచక్ర వాహనదారులకు తగులుతోంది. ఒక్కోసారి ప్రమాదానికి కారణమవుతోంది. వెనుక నుంచి వచ్చే వాహనాలకు లారీలు దారి ఇవ్వడం లేదు. దీనివలన లారీ డ్రైవర్లు ఇతర వాహనదారుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. చిన్నచిన్న రహదారుల్లో ఈ వాహనాలు వెళ్తున్న సమయంలో ఇతర వాహనాలకు దారి ఉండడం లేదు. ఆ సమయంలో పట్టించుకోని పోలీసులపై ప్రయాణికులు చీదరించుకుంటున్నారు. ఇదే విషయాన్ని హైవే పెట్రోలింగ్ పోలీసుల వద్ద ప్రస్తావించగా వాటిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

పరిమితికి మించి ప్రమాదకరంగా రవాణా చేస్తున్న ఊక లారీ